సిద్దిపేట జిల్లా లద్దునూర్‌లో ఏప్రిల్, 3, 1941 జన్మించారు. ఈమె తల్లిదండ్రులు అంజమ్మ, మల్లయ్యలు. మొదటి కథ 'ఓ ఆడపిల్ల కథ', ఆలిండియా రేడియోలో 1995లో ప్రసారమయింది. 'సప్త స్వరాలు', 'ఒక పువ్వు పూసింది', 'ఎర్ర మందారం', కవితా సంపుటాలను, 'లచ్చుమమ్మ ముచ్చట్లు', 'ప్రకృతికే ఆభరణాలు' రూపకాలు వెలువరించారు. ప్రభుత్వ ఉన్నతస్థాయి విద్యా అధ్యయన సంస్థ, మాసబ్‌ట్యాంక్, హైదరాబాద్‌నుంచి ఆచార్యులుగా రిటైరయ్యారు.



డా. సరోజన బండ

# బర్రెంక చెట్టు ...ఓ యాది

రమారమి అరవై తొమ్మిదేండ్ల మాట. నేను అయిదేండ్ల పిల్లను. ఓ రోజు సందాల్ల మా ఊరి చెర్వు కట్టమీంచి ఓ మూడొందల మంది జైకొట్టుకుంట ఒత్తన్నరు. సేన్లు సెలకల నుంచి జనాలు గప్పుడే వచ్చి ఎసర్లు వెట్టి బువ్వొండి వారవెట్టుకున్నరు. తొక్కో పులుసో సేసుకున్నరు. మా అవ్వ గుడ బువ్వారవెట్టి పెసరుపప్పు, పొట్లకాయ ఎసులల ఏసి పొయి మీద ఉమ్మొగులబెట్టింది. గాసప్పుడేందో ఎవలకు సమజ్‌కాలేదు. గప్పుడు ముసల్మాన్లు నమాజు చేసుకుంటున్నరు. బావుద్దిన్ తాత అజాయించిండు. మా నాయినమ్మ గాసప్పుడేందో సూడమని అన్నను నిచ్చెనెక్కించింది. అన్న కొట్టంమీంచి సూసిండు. తెప్పలెక్క జనాలు ఒత్తన్నరని సెప్పిండు. గది రజాకార్ల కాలం. అంతకు ముందటి సందే మా నాయిన రోజు నాకగాయ వొయేది. సందాల్ల బువ్వదిని కందిన్లు వట్టుకుని ఊరిసుట్టు తుమ్మమొద్దుల నెగల్లు ఏసుకుని ఒయిసోల్లు, ముసలోల్లు అనకుంట ఒంతులేసుకుని అందరు నాకగాయ వొయేది. వాడకట్టులున్న దగ్గెరి దగ్గెరి ఇండ్లోల్లు మా ఇంటికొద్దురు. బెడెం పెట్టుకుని ముచ్చట్లు పెట్టుకుంట కూకుందురు. సిన్న అలికిడైనా బుగులువడుదురు. ఊరుసుట్టుపక్కల, ఏరే ఊర్లల్ల రజాకార్లు ఏమేమి జేసింది సెప్పుకుంట పానాలు అరిసేతుల వెట్టుకొని కూసుందురు. మబ్బుల వాకిలి పడగొట్టేయాల్లకు మొగోల్లు ఇంటికొచ్చినంక ఎవల ఇండల్లల్లకు వాల్లు వోదురు.



ముందుగల్ల బైరాన్‌పెల్లె, మా మ్యానత్త ఊల్లె దాడి జరిగింది. రజాకార్లు గామె పెయి మీద నగలు ఒలుసుకున్నరు. గంటెపుస్తె, గుండ్లు తెంపుతంటె గామె మా నాయిన సెల్లెనని సెప్పిందట. గప్పుడు వాల్లు మాట్లాడుకుని గామె గంటె పుస్తెను తెంపకుంట ఇడిసిపెట్టిండ్రట. గా ఊల్లెనె మా తాత గాడిపెల్లి రామయ్యను పురుసాల్లల్ల తుపాకీతోని కాల్చిండ్రు. దాడి జరిగినంక మా నాయినమ్మ బిడ్డను ఓదార్సెటందుకు పోయింది. నన్ను ఎంబడి తీస్కవొయింది. మా నాయినమ్మను సూడంగనే మా మ్యానత్త సోకంబెట్టింది. దాడి ఎట్లెట్ల జరిగింది పూసగుచ్చినట్టు ఇవరంగ జెప్పింది. ఇంట్ల తిండి గింజలు గుడ లేవు. మా నాయిన సెల్లె కోసమని రొండు బుడ్ల బియ్యం వోసి బండి గట్టి మమ్ములను తోలిచ్చిండు. గప్పుడు నాయినమ్మతోని నేనుగుడ రామయ్య తాత, జానుకమ్మమ్మ ఇంటికి వొయిన. నాయినమ్మను సూడంగనే జానుకమ్మమ్మకు కడుపులున్న ఎతంత ఎగదోసుకుని ఒచ్చింది. కాగలిచ్చుకొని సోకంబెట్టింది. తాత ఉన్న అర్రలకు తోల్కపోయింది. తాత నాయినమ్మకు ముచ్చటంత జెప్పిండు. సచ్చి బతికినం అని కండ్ల నీల్లు పెట్టుకున్నడు. తన పురుసాల్లల్ల నుంచి తుపాకి గుండు ఎట్ల వొయింది సూపెట్టిండు. గా జాగల నెత్తురు ముద్దలెక్క ఉండె. గది ఇంక గుడ నా కండ్లల్ల మెరుస్తన్నది.

గట్లనే గా జమానాల మా నాయినమ్మ తమ్ముడు పిట్టల కిట్టయ్యను గుడ రజాకర్లు కాల్చి సంపిన్రు. అమాయకుల ఉసురువోసుకున్నరు. గాయినె సేన్ల ఉన్నప్పుడు రజాకార్లు గక్కడికి వోయి సేన్ల ఉన్న మక్క జొన్న కంకులు ఇరిపిచ్చుకొని తాతతోని కాలిపిచ్చుకున్నరంట. అరుసుకుంట, నవ్వుకుంట, లొల్లిజేసుకుంట కంకులను ఒలుసుకొని తిని, తాగెతందుకు నీళ్లు గావాల్నని అడిగిండ్రట. కిట్టయ్య తాత లొట్టి తీస్కపోయి మోట బాయిల నుంచి నీళ్లు తెచ్చిండట. నీళ్లు దాగి గాల్లు బండి గట్టుమన్నరట. తాత బయం బయంగ ఎడ్లను దెచ్చి బండి గట్టిండట. గాయినెను బండికి ఎదురుంగ నిలవెట్టి తుపాకి తోని కాల్చి సంపిన్రట. దీంతోని ఎల్దండ ఊరంత గజగజ ఒనికి పోయింది. గీ సంగతిని నాయినమ్మ యాజ్జేసుకొని ఒలఒల ఏడిసేది. ఇంటికొచ్చినోల్లకు జాగర్తలు సెప్పేది. మా నాయినెను కంటికి రెప్పలెక్క సూసుకునేది. ముసల్మాన్లందరు నాయినతోని సోపతిగ ఉండెటోల్లు. ఒరుసలు వెట్టి పిలిసేటోల్లు. పండగ పబ్బాలకు గుడ తినేటియి పంపుదురు. మంచి సెడ్డలు మాట్లాడుకుందురు. గాల్ల ఆడోల్లు గుడ బురకలేసుకొని నాయినమ్మ దగ్గెరికొద్దురు. ముచ్చట్లువెడుదురు. అవ్వకు పాము కరిసి నోటి నుంచి నురుగులు ఒచ్చినపుడు, సొన్నెకాన్ మిసికీను మామ రాత్రంతా మా ఇంట్లనె ఉండె. బాయి మీద సన్నీళ్లతోని తానం జేసి యాపకొమ్మలు, యాపాకు, ఉల్లిగడ్డలతోని అవ్వకు వైద్గం జేసిండు. రొండు మూడు రోజులు అవ్వ నిదుర మత్తుతోని సొలుగుతనే ఉండె. ఎట్లనోగట్ల మామ అవ్వను బతికిచ్చిండు. గిట్ల ముసల్మాన్లు ఆపతిల సంపతిల మమ్ములను ఆదుకునేది.

ఒగ త్యాప చెరుపుద్దీన్ మామ నాయినను రమ్మని మతులబు జేసిండు. నాయిన పోంగనే ఆయినె నాయినను కాగలిచ్చుకొని ఏడిసిండట. "గిన్ని రోజుల సంది మనం అన్నదమ్ములలెక్క కలిసున్నం. ఇగ ఒచ్చే రోజులు ఎట్లుంటయో ఏమో" అన్నడట. గప్పుడు రజాకార్ల జమానా జోరుగుండె. పౌజు దిగేది. గాల్లు రాంగనే తెలుగోల్లందరు బెడాలు వెట్టుకొని, తలుపులు దగ్గరేసుకొని గొళ్లాలు వెట్టుకొని బిక్కుబిక్కుమనుకుంట ఇండ్లల్ల కూసునేది. జైలు కానాల ఉన్నట్టు ఉండేది. పోరగాల్లం తలుపు సందుల నుంచి సూసేది. పౌజోల్లు గుర్రాల మీద ఊల్లె తిరిగేది. గుర్రాలు నడిసే సప్పుడు, పౌజోల్ల బూట్ల సప్పుడే ఇనపడేది. కాసిం మామ వాల్లకు మంచి తిండి పెట్టిచ్చేది. ఏందో అంత గడబిడగా అనిపిచ్చేది. ఎటువోయినా బయంగ ఉండేది. గప్పుడే మా రామక్క బిడ్డను కాల్లు సేతులకున్న ఎండి కడాలు, గుండు వోగులు తీస్కొని సంపి బాయిలేసిన్రు. గాపని రజాకార్ల పనేనట. గది జరిగినంక నాయినమ్మ బయంతోని అక్కను, నన్ను ఇంట్ల నించి బయటికి పోనిచ్చేది కాదు.

బైరాన్‌పల్లెల జరిగిన దాడి లెక్కనే మా లద్నూరు మీద దాడి సెయ్యాల్నని రజాకార్లు పిలాను ఏసిన్రు. గా రోజు పుట్టిన గుడ్డుకాంచి తెలుగోల్లను సంపాలనే పిలాను. గది చెరుపుద్దీన్ మామకు ఎరుకయి నాయినను పిలిసి ఆఖరుసారిగా అన్నట్టు గా మాట సెప్పిండు. కమినిష్టోల్లు గా రోజులల్ల చీకటాల్ల వొచ్చి మా ఇంట్ల అన్నం తినిపోదురు. ఆరుట్ల రామచంద్రారెడ్డి, కమలాదేవి గుడ కొలిపాక నుంచి మా ఊరికి ఒచ్చిపోదురు. నల్ల నర్సిమ్ములు, సర్వారెడ్డి గుడ మా ఇంటికి ఒచ్చేది. నేను చానా సిన్నపిల్లను. బొమ్మలాటలు, గురుగులాటలు తప్ప గివన్ని ఎరుకయేటియిగావు. అయితే గీ పిలానంతా కమినిష్టోల్లకు తారుతోని తెలిసిందట. గందుకే గయాల్ల మా ఊరి మీదికొచ్చింద్రు. దొరికినోల్లను దొరికినట్టు ముసల్మాన్లను ఈడ్చి సంపిన్రు. అజాయించి గప్పుడే మసీదుల నుంచి బయటికొచ్చిన బావుద్దిన్ తాతను కాల్చి సంపిన్రు. నమాజు చేసుకునేటోల్ల పానం దీసింద్రు. ఇండ్లను దోసుకున్నరు. కాలవెట్టిన్రు. ఊర్ని పీనుగుల పెంట జేసిన్రు. తెలుగోల్ల జోలికి రాలేదు. గని గా సీకట్ల తెలుగోల్లు ముసల్మాన్లు అనకుంట ఎవలకు దొరికిన తొవ్వల వాల్లు అడివిలకు పక్క ఊర్లల్లకు ఉరికిపోయిన్రు. మా అవ్వ తమ్మున్ని సంకలేసుకొని నన్ను ముండ్ల కంపలు, తుప్పలు, ఎనుగులల్ల నుంచి ఈడ్సుకొని తోల్కపోయింది. తెల్లారగట్ల ఎల్దెండకు సేరుకున్నం. మా ఎల్లక్క ఇంట్ల తలదాసుకున్నం. గప్పుడు జరిగిన గీ సంగతులన్ని చెప్పుకుంట వోతె పెద్ద కతనే అయితది. గవన్నీ నాకు యాదికున్నయి.

మా నాయిన జెప్పంగ యిన్న. మా ఊరి మీద రజాకార్ల దాడి 17-9-1948 ఈస్విన జరిగిందట. నేను బడిల చేరీకు అయిన మూన్నెల్లకే దాడి జరిగింది. దాంట్లె మా బడి గుడ నామ్‌నిషాన్ లేకుంట కాలిపోయింది. గప్పుడుగప్పుడు యాదికొచ్చినప్పుడల్లా



గా కాలిపోయిన బడికి వోయి అంత కలెదిరిగేదాన్ని. కిలాసుల నేను కూకున్న జాగ చూసుకునేదాన్ని చెప్పలేనంత ఏడుపొచ్చేది. గప్పటి సంది మా ఊల్లె పన్నెండు జాగలల్ల బడివెట్టిన్రు. ఓ దినం బడికి వోతె నాల్రోజులు ఎగ్గొట్టేదాన్ని. బడిగంట యాల్లకు నీడలు సూసుకుని పిడుకల కుచ్చెలు, గడ్డివాములు, పెరట్ల మక్కజొన్న జూలల్ల దాక్కునే దాన్ని. ఒగోత్యాప బడిగంట కొట్టేవరకు నిదురవోయినట్టు చేసేది. మా 'చెప్పరాసి' జాంగీరు వచ్చి "తాతమ్మా" అని పిలిసేటోడు. నాయినమ్మ ఇంక పిల్ల లేవలేదని సెప్పేది. గా రోజు గండం గట్టెక్కేది. లేసి మొకం కడుక్కొని ఊరిమీదవడేది. గవుండ్ల ఎల్లవ్వ, కురుమ లచ్చిమి, పెద్ద చాలి సిద్దవ్వ, పటేండ్ల రంగవ్వ, కాపోల్ల అంజవ్వతోని ఆటలాడేది. అందరం రోజుకో దగ్గెర కూడేది. అందరికి పెబ్బను నేనే. వాల్లవ్వలు మమ్ములను ఎంకులాడుకుంట ఒచ్చి మా ఆటలను సెడగొట్టేది. పోరగాల్లను ఇంటికి తోల్కపోయేది. బువ్వదిన్నంక ఒచ్చి ఆడుకొమ్మని సెప్పుదురు గని సేను పన్లకు తీసుకపోయేది. నేను గుడ అవ్వ నాయినతోని సేనుకువోయేది. నాకు సోపతి తమ్ముడు.

సిన్నప్పటి సంది తమ్ముడు నేను మంచి సోపతిగాల్లం. అవ్వ మాకు వారుబ్బువ్వల మామిడికాయ తొక్కేసి మీగడ పెరుగు పోసేది. ఒగోత్యాప గటుకల పెరుగు సల్లగని, పాలుగని పోసేది. తిన్నంక మేమిద్దరం తలెల ఏలుతోని అచ్చెరాలు రాసుకుంట కూసునేది. బువ్వదిన్నంక ఇద్దరం అవ్వ నాయినతోని సేనుకాడికి వొయేది. గాడ గొడ్లను కాసేటోల్లం. బర్రెంక సెట్టు మా సదువు తావురం. పాత సందమామ, బాలమిత్ర, పెద్ద బాలశిచ్చ, చినిగిపోయిన పాత పొట్లాల కాయిదాలు, ఒక జోరసంచి, ముల్లుగర్ర, లిక్కిడి మా సదువు సామగ్రి. జోరసంచి కింద పరుసుకునేటందుకు, వానవొస్తే కొప్పెరకు పనికొచ్చేది. సందమామ, బాలమిత్రల ఉన్న బొమ్మలను, సిత్రాలను చూసుకునేది. రాజులు, రాణులు, బేతాలుడు, ఏనుగులు, గుర్రాలు అన్నిటిని ఇవరంగ సూసేది. ఒర్రెల ఉసికెల ముల్లుగర్రతోని అచ్చురాలు రాసేది. లిక్కిడితోని గడ్డి తీసేసి నేలను సదునుజేసి కర్రపుల్లలతోని సిత్రాలు గీసేది. పిట్టగూల్లు కట్టేది. దూంపుల్ల ఆట ఆడేది. 'కుక్కకు మాంసం దొరికినది/ అది వంతెన మీదుగ పోయినది/తన నీడను తానే సూసినది/వేరొక కుక్కని తలచినది/ భౌభౌభౌభౌ అరిచినది/ఉన్నది కాస్తపోయినది' లాంటి గీతాల్ని సదువుకుంట ఎగురుకుంట దుంకెటోల్లం. గుడ్డంల సిన్న సిన్న గులుక రాల్లు ఏరుకొచ్చేది. తమ్ముడు గాలిల అచ్చురం రాయాలె. నేను దాన్ని సూసి గురుతువెట్టుకొని గులకరాల్లతోని పేర్వాలే. నేను గాలిల రాసినపుడు తను ఎరుకవెట్టుకొని పేర్వాలే. గిట్ల గంటలకొద్ది మేము గీ అచ్చురాల ఆట ఆడేది. గట్లనే ఒర్రె పారిన దగ్గర నీళ్లల్ల గీ ఆట ఆడేది. గులకరాళ్లు చేతుల కింద దాపెట్టి ఏక్, దో, తీన్ ఆట ఒకటి రెండు మూడు ఒంట్లాట ఆడేది. గట్లనే మాకు ఓనమాలు,

ఒంట్లు అన్ని ఒచ్చినై. ఒగోత్యాప గుడ్డంల జిట్టరేగుపండ్లు ఏరుకొచ్చుకొని వాటిని ఏంచి కుచ్చాలు పెట్టుకొని పంచుకునేది. అల్లనేరేడు, ఈత, తునికి, చిలుపక్కపండ్లు, కాల్చిన ఏరుచెనగకాయలు ఇద్దరం సరిసమానంగ ఏంచి పంచుకుని తినేటోల్లం.

అవ్వ సిన్నప్పుడు తమ్మున్ని కాల్లమీద ఏసుకొని నువ్వుల నూనెతోని కాల్లు సేతులు తీడి, సున్నిపిండి వెట్టి పెయిరుద్ది ఉడుకు నీల్లతోని తానంజేయించేది. నొసలు రాసి, ముక్కొత్తి, చెవులూదేది. పాలనోటిని ఏలువెట్టి తుడిసేది. పొడి తువ్వాలుతోని పెయి తుడిసేది. నొసటన అగరుబొట్టు, సెంపకు జిట్టిసుక్క, అరికాలుకు మసిబొట్టువెట్టి, పక్కబట్టలను ఒత్తొత్తి చూసి ఉయ్యాలల పండబెట్టి 'ఉలూలు ఆయమ్మ, ఉలూలు ఆయి' అని నాలికెనాడిచ్చుకుంట జోలపాట వాడి నిదురపుచ్చేది. నా చెక్క బొమ్మకు నేను గుడ గట్లనే చేసేది. ఇదంత సూసిన నాకు, పెద్దగయినంక పాలకురికి సోమన్న రాసిన బసువపురానం కతల ఉన్న బెజ్జమహాదేవి 'పాటం' బాగ మనుసుకెక్కింది.

మా అమ్మమ్మ ఊరు మా ఊరి పక్కపొంట ఉండేది. అద్దగంట తొవ్వ. గందుకే మేము ఎప్పుడు ఆడుంటె ఈడ, ఈడుంటే ఆడ ఉండెటోల్లం. వాల్ల ఇంట్ల పాలరాతి గచ్చుతోని జేసిన తానాల అర్ర, నీల్ల అవుజులు, అరుగులు ఉండేటియి. దివాన్‌ఖాన లొద్దిల గుడ పాలరాయి మీద చెక్కిన పచ్చీసు, పుంజీతం, అట్టచెమ్మ ఉండేటియి. గవ్వలు చింతగింజలతోని ఎన్ని తీర్ల ఆటలో ఆడేది. 'కైలాసం' ఆట ఆడేది. చెత్రశాల భవంతిల మొగురాలాట ఆడేది. గప్పట్ల మాకు చాబుద్దీన్ సారు చెరిత్ర సెప్పేటోడు. గాయినె 'మొహంజోదారో, హరప్పా నాగరికత' పాటం సెప్పినపుడు నాకు అమ్మమ్మ ఇల్లు యాదికొచ్చేది. గట్లనే ఇస్పనాద సత్తెనారాయన రాసిన 'వీధి అరుగు' పాటం సదివినపుడు అమ్మమ్మ ఇంటి అరుగులు మదిల మెదిలేటియి. గిసొంటి సంగతులన్ని నాకు తెలుగు బాస నేర్సుకోవటానికి పనికొచ్చినయి.

మా అవ్వకు పద్దాలు, పాటలు, కీర్తనలు నోటి మీదనే ఉండేటియి. గురుబోధకు సంబంధించిన పద్దాలు సెప్పేది. "నరములస్తులు చర్మ నఖరోమ మాంసముల్ భూగుణంబులు... మూత్ర శ్లేష్మములు జలగుణంబులు" అని పంచ భూతాల గురించి ఇవరంగా పాటాలు ఒంట పట్టించేది. మా నాయినమ్మకు గుడ వారాలు, తిథులు, నచ్చత్రాలు, రాసులు, కార్తులు అన్ని నోటి మీదనే ఉండేటియి. మంచి మూర్తాల కోసం ఊరోల్లు అందరు గామెనే అడిగేది. అవ్వకు ఒయ్యిలు సదువ రాదుగని తీరు తీరు పద్దాలు సదివేది.

మా నాయిన నిజాం కాలంల అయిదో కిలాసు సదివిండు గని యాపారం, యగుసాయమే సేసిండు. మా ఇంట్ల చెక్క సందుకలల్ల తురుకం, తెలుగువి చానా ఒయ్యిలు



ఉండేటియి. కందుకూరి ఈరేశలింగం పంతులు రాసిన ఒయ్యి 'రాజశేఖర చరిత్రం'ను నేను దాచి పెట్టుకున్న. 'సత్యార్థ ప్రకాశిక' గుడ జాగర్తగ ఉంచుకున్న. సిన్నప్పుడు నాయిన, అవ్వ, నాయినమ్మతోని నేను బాగోతం, యచ్చగానం, కోలాటం, అరికత, బుర్రకత, అల్లిరానికత, బొబ్బిలికత, సిరియాలుని కత, బీరప్పకత, పంబాలోల్ల కతలు నిదురగాసి ఇనేటందుకు, సూసేటందుకు పోయేదాన్ని. దొరవారి ఇంటి ముందు చాందిని ఏసి పెట్రొమాక్సులు వెట్టి గివన్ని నడుపుదురు. గా కాలంల మాకు గడియారాలు తెల్వవు.

కోడికూసినపుడు, గోరుకొయ్యలు, మూలసుక్క పొడిసినపుడు యాల్ల ఎంతయిందో నాయిన సెప్పేటోడు. పగటి పూట గోడ నీడలను సూసి పొద్దు సెప్పుదురు. మసీదుల అజాయించినపుడు గుడ మాకు యాల్ల దెలిసేది. గా కాలంల పచ్చుల కిలకిల సప్పుడు, పసుల సందడి మబ్బుల్నే ఇనవడేది. గిప్పుడు గా సప్పుల్లేవి ఇనవడుతలేవు. ఊర్లన్ని దోడు దోడు అయినయి.

పగులంత పొలాలు, సేన్లు, సెలకలల్ల పనిజేసిన జనాలు గూట్లె దీపం నోట్లె ముద్ద అన్నట్టు జల్ది బువ్వదిని యెన్నెల్ల ఈత సాపలు పరుసుకొని కూసొని దునియ ముచ్చట్లు వెడుదురు. మా అవ్వ, నాయినమ్మ మంచి మంచి కతలు, మస్తు పొడుపు కతలు సెప్పుదురు. ఎండి పొన్ను కట్టె పట్టుకొని ఒంతులేసుకుని తమ్ముడు నేను నాయిన కాల్లు దొక్కుదుము. గప్పుడు నాయిన సామెతలు, పలుకుబల్లు, పద్దాలు వాటి అర్థాలు అన్ని ఆట పద్దతిల ఇవరంగ సెప్పేది. రుద్రమ్మ, మల్లమ్మ, జాన్సి లచ్చిమి, చాందు సుల్తానా, రుక్సానా, అలెగ్జాండరు, పురుసోత్తముడు, అంబి కతలు, మొగలు రాజులు, బహమని సుల్తానులు, గోలుకొండ నవాబుల గురించి కతలు సెప్పేటోడు. గోలుకొండ కోట, గుమ్మదులు, చార్‌మినార్, మక్కమసీదు, సాలార్‌జంగ్ మ్యూజియంను పట్నం దీసుకొచ్చి సిన్నప్పుడే మాకు సూపెట్టిండు. తానీషారాజు, అక్కన్నమాదన్న, రామదాసు చెరిత్రజెప్పిండు. గీ వీటితో పాటు నోటి లెక్కలు గుడ సెప్పేటోడు. ఒగత్యాప నాయిన పద్దెంతోని ఓ లెక్క జెప్పిండు. నేను చేసి అప్పుజెప్పిన. సంతోషంతోని నన్ను ముద్దిచ్చుకున్నడు. గిట్ల ఆల్లు సెప్పే ఇసయాలన్నీ నాకు పాటాలైనై.

యెన్నెల రాతిరిల జల్ది బువ్వదినొచ్చి పోరగాల్లందరం తీరు తీరు ఆటలాడేది. 'మల్లె మొగ్గ మెల్లంగొచ్చి గిల్లిపో', దొంగపోలీసు, దాగుడుమూతలు, లంబలంబ చిట్టి, ఉప్పు బొందలు, డిల్లెమ్మడిల్లి ఆటలు ఆడేది. నొగలు ఇరిగిపోయిన బండ్లు, పొనుకలు, బోరాలు, టిక్కి, గానుగబండ మాకు దాక్కునుటందుకు పనికొచ్చేటియి. 'డిల్లెమ్మడిల్లి' ఆటల దోస్తులం జోలపాటలేసుకొని పాటపాడేది.

ఆడిపిల్లోల్లు: సిబ్బిలేనింటికి నా బిడ్డనిస్తినీ

తాన తందయ్యలో గోగు పువ్వయ్యలో

మొగపిల్లోల్లు: అప్పుడెందుకిచ్చినవు అరికాలి చెప్పే ॥తాన॥

ఆ: కనరాని కంతలకు నా బిడ్డనిస్తినీ ॥తాన॥

మొ: సిగ్గెగ్గు లేకుంట నా ఇంటికొస్తివి ॥తాన॥

ఆ: పిల్లనిచ్చేటపుడు ఇల్లు సూడాలమ్మ ॥తాన॥

మొ: ఇల్లు సూడకుంటా పిల్లనెట్లిస్తివి ॥తాన॥

ఆ: ఎరుక లేకిచ్చిన ఎనుగుల్ల వడ్డ ॥తాన॥

గిట్ల సిబ్బితోని మొదలైన పాటను చాట, చీపురు, తట్ట, గుల్ల, గంప, బిందె, తాడు, బొక్కెన, రోలు, రోకలి, కుందెన, చాప, సదిరె, గొడ్డలి, గడ్డపార, పోసుగంటె, రొట్టెపెంక... ఊర్లల్ల కనీస అవుసరమైన వస్తువులనన్నిటి మీద పాడుకోవచ్చు.

అవ్వ నాయిన మాకు సేన్లు, సెలకలు, గుడ్డంల పనిజేసినప్పటి సంది కూరగాయలు, ఆకు కూరలు, పశువులు, పక్షులు, పురుగులు నేలల తీర్ల గురించి సెప్పేటోల్లు. అడవులు, కొండలు, గుట్టలు, గట్లు, మడులు, బాయిలు, చెరువులు, కుంటలు, వాగులు, ఒర్రెలు, కయ్యలు, కందుకాలు, ఊటలు, సెలిమెలు అన్ని మాకు గప్పుడే ఎరుక. రంగులు, మోతాదు, జోకుడు, కొలుసుడు, హోలికల్దారు, పైసల లెక్కలు అన్ని అమ్మ దగ్గెర నేర్సుకున్నయే. గా కాలంల పసురాలకు దానా వెట్టి, గడ్డేసి నీళ్లు తాగిచ్చి కుడితి వెట్టుట్ల అమ్మ నాయినలకు సాయంజేసేది. కలుపుదీసుడు, నాట్లేసుడు, కోసుడు, జూల్లేసుడు, కొట్టుడు, తూర్పారవట్టుడు, జల్లెడ వట్టుడు, చెరుగుడు, మలుసుడు, కోడుడు, తాల్సుడు, నేముడు, ఇసురుడు, దంచుడు, పోటేసుడు, కడుగుడు, చల్లుడు, అలుకుడు, ముగ్గేసుడు, నామాలువెట్టుడు... పని ఇలువ వున్న పనులన్నీ చేసేదాన్ని. గానుగ తోలుడు, వడిసెల ఇసురుడు గుడ నేర్సుకున్న.

పాల కంకుల పిసికిల్లు దినేది. ల్యాగ దూడలతోని ఉరుక్కుంట ఆడుకునేది. కోయిలమ్మ కుహూ కుహూ రాగాలతో జత కలిపేది. సిలుకమ్మ కొరికిన జామపండ్ల కోసం గడిగ్గడికి ఎదిరి చూసేది. కాకులు, గద్దలు, ఒడ్లపిట్టలు, లకుముకి పిట్టలు, లవంగులు, ఊరవిసికెలు, కొంగలు, బాతులు, గోకలు, గొర్రెంకలు, పాలపిట్టలు, బుర్కపిట్టలన్నిటిని పరీచ్చగ సూసేది. దువ్వెన్లు పట్టేది. బంగారి, ఆరిద్ర పురుగులతోని ఆడుకునేది. ఎల్లంబాయి సెట్లకు యల్లాడే పిట్ట గూల్లను సూసి మురిసిపోయేది. జాసువ గిజిగాడు పాటం ఇన్నప్పుడు గివి యాదికొచ్చేటియి.

గా కాలంల నా పీసు ఒగ ముద్ద పైస. నేను పక్కా బడి దొంగను. మా సారు బడి ఎగ్గొట్టినందుకు ఇంకో ముద్దపైస జుల్మాన ఏసేటోడు. గవి కట్టలేక బడి ఎగ్గొట్టేది. గట్ల



గట్ల నేను సెల్కల పొంటి దిరిగి అయిదో కిలాసు వరకు సదివిన. ఆడిపిల్లకు సదువుగావాల్నని, నా బిడ్డకు సదువు రావాల్నని, తమ్మునికి సోపతిగ ఉంటనని, ఆరేడు కిలాసులు తెచ్చేటందుకు ఏరుచెనక్కాయ అమ్మి మా బడికి నాయిన పెద్ద మొత్తంగ ఇరాలమిచ్చిండు. నా బతుకుల దీపమెలిగిచ్చిండు. నా తోనే ఏడో కిలాసు కామన్ పరీచ్చ మొదలైంది. మా ఊల్లె సదువుకున్న ఆడిపిల్లలల్ల నేనే మొదటి దాన్ని. గవుర్మెంటు ఉద్యోగం చేసిన దాన్ని నేనే. మొదట సదువుల డాకుటరు అయింది నేనే. నన్ను సూసినంకనే మా ఊల్లె ఆడిపోరగాండ్లను సదివిచ్చుడు మొదలువెట్టిన్రు. నేను మాత్రం అచ్చరాల ఆటలను నేర్పిన 'బుర్రెంకచెట్టు'ను నిత్తెం యాజ్జేసుకుంట.

**కథలో వాడిన కొన్ని తెలంగాణ తెలుగు పదాలకు అర్థాలు**

ఎసుల- కూర వండడానికి ఉపయోగించే మట్టి పాత్ర

బెడెం- తలుపు గోడలకు రెండు వైపులా కన్నాలల్లో బిగించే పెద్ద కర్ర

గంటె పుస్తె- తాళిబొట్టు: బుడ్డి - ధాన్యం కొలిచే కుండ/బిందె

లొట్టి - చిన్న మట్టి కుండ: పెబ్బె - నాయకుడు/నాయకురాలు

వారుపు బువ్వ - కలివెట్టి వండి వార్చిన అన్నం

తలె - పళ్లెం: లిక్కిడి- చిన్న కొడవలి: గుడ్డం - చిన్న వ్యవసాయ క్షేత్రం

కుచ్చాలు - కుప్పలు: చిలుపక్క పండ్లు - సీతాఫలాలు

చత్రశాల భవంతి- నాలుగు రోకుల భవంతి: మొగురం - స్తంభం

ఒయ్యి - పుస్తకం: చెక్క సందుక - కర్రపెట్టె

దోడు దోడు - పాడు పాడు: టిక్కి - సామాను పెట్టుకునే చిన్న గది

ఎనుగు - ముళ్ల కంపతో కూడిన కంచె: పసురాలు-పశువులు

గడిగ్గడికి - నిమిషనిమిషానికి:

కొప్పెర- రక్షణ కోసం గోనె సంచిని మడచి తలపై పెట్టుకోవడం

'తెలుగు వెలుగు' మార్చి